సాక్షి
మంచిర్యాల
ఆదివారం । 28 । జనవరి । 2024

నీ వెంటే నేను..



అగ్ని సాక్షిగా మూడు ముళ్లతో ఒక్కటైన ఆ బంధం ఎనిమిది నెలలకే 'చితి'కి పోయింది. క్షణికావేశం వారిని అనంత లోకాలకు చేర్చింది. ఆత్మహత్య చేసుకున్న ఆ నవదంపతులను ఒకే చితిపై చేర్చడం అందరినీ కంటతడి పెట్టించింది. 8లో▸

విపత్తులపై అవగాహన ఉండాలి



విపత్తుల సమయంలో తమను తాము రక్షించుకునే విధానంపై అవగాహన కలిగి ఉండాలని 10వ బెటాలియన్ ఎన్‌డీఆర్‌ఎఫ్ విభాగానికి చెందిన సీఐ బిటెన్ సింగ్ అన్నారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
30.0 /15.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఈశాన్యం దిశగా చలిగాలులు వీస్తాయి. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

వైద్య సేవల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దు

- జిల్లా కలెక్టర్ సంతోష్



హాజరు పట్టికను పరిశీలిస్తున్న కలెక్టర్

మంచిర్యాలటౌన్: గర్భిణులు, పిల్లల సంక్షేమం కోసం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన మాతా శిశు కేంద్రం ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించాలని, ఎలాంటి నిర్లక్ష్యం వహించొద్దని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శనివారం ఎంసీహెచ్‌ను కలెక్టర్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుబ్బరాయుడుతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వార్డులు, ల్యాబ్ పరిశీలించారు. వైద్యులు, సిబ్బంది హాజరు పట్టికలను తనిఖీ చేశారు. ప్రసూతి, పిల్లల వార్డుల్లో మౌలిక వసతులు, బయోమెట్రిక్ విధానం పరిశీలించారు. గర్భిణులు తమ వివరాలను సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో నమోదు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలని, సమయానుకూలంగా పరీక్షలు చేసుకునేలా వివరించాలని సూచించారు. ప్రసవాలు తప్పనిసరిగా ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే జరిగేలా చూడడంతోపాటు సాధారణ ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. వైద్యులు, వైద్య సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించినా, గర్భిణులు, బాలింతల పట్ల ఇష్టారీతిన ప్రవర్తించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎస్సీ హాస్టల్‌కు పాత కలెక్టరేట్ భవనం



పాత కలెక్టరేట్ భవనంలో విద్యార్థినులు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల జిల్లాగా ఏర్పడినప్పుడు ఎస్సీ హాస్టల్ భవనాన్ని కలెక్టరేట్ కార్యాలయానికి అప్పగించారు. 2016లో భవన నిర్మాణం పూర్తయిన తర్వాత కలెక్టరేట్ నిర్వహించారు. గత ఏడాది నస్పూర్‌లో సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలోకి అన్ని కార్యాలయాలు మార్చారు. దీంతో ఖాళీగా ఉన్న పాత కలెక్టరేట్ భవనాన్ని ఎస్సీ హా స్టల్‌కు కేటాయించాలని విద్యార్థి సంఘాలు, విద్యార్థులు కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేశారు. ఎట్టకేలకు భవనాన్ని కేటాయిస్తూ ఎస్సీ అభివృద్ధి శాఖ నుంచి జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి పి.రవీందర్‌రెడ్డికి ఉత్తర్వులు జారీ అయ్యాయి. శనివారం నుంచి పూర్తి స్థాయిలో ఎస్సీ కళాశాల బాలికల హాస్టల్‌కు అందుబాటులోకి వచ్చింది. పాత కలెక్టరేట్ భవనాన్ని కేటాయించడంలో అధికారుల తాత్సారంపై గతంలో ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా జనరల్ సెక్రెటరీ నయీంపాష, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు కొంటు రాజేందర్ జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు చేసిన ఫిర్యాదుపై స్పందించి భవనం కేటాయించడంపై ఆనందం వ్యక్తం చేశారు.

ఆటోడ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్

మంచిర్యాలక్రైం: ఆటోడ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని స్థానిక డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్ అన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక సీఐ నరేష్‌కుమార్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని బాలాజీ మినీ ఫంక్షన్ హాల్‌లో ఆటోడ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోడ్రైవర్లు ప్రయాణికుల పట్ల బాధ్యతాయుతంగా, మర్యాదగా వ్యవహరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ తిరుపతిరెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ నర్సింహులు సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

సైన్స్‌బోధనలో సెమినార్ పత్రాల ఆహ్వానం

మంచిర్యాలఅర్బన్: పాఠశాల స్థాయిలో కొత్త పోకడలతో విద్యార్థులకు సైన్స్ బోధన, సైన్స్ అధ్యాపకులు, ఉపాధ్యాయుల్లో నైపుణ్యాన్ని పెంచేందుకు రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండలి(ఎస్సీఈఆర్టీ) ప్రత్యేక సదస్సు నిర్వహిస్తోందని డీఈవో యాదయ్య తెలిపారు. వృత్తి నైపుణ్యాన్ని పెంచడానికి సైన్స్ ఉపాధ్యాయులు, అధ్యాపకుల నుంచి పరిశోధన పత్రాలు ఆహ్వానిస్తోందని తెలిపారు. ఎంపికైన వారికి జాతీయ సైన్స్ దినోత్సవం ఫిబ్రవరి 24న రాష్ట్ర సదస్సులో పాల్గొనే అవకాశం కల్పిస్తారని తెలిపారు. వివరాలకు జిల్లా సైన్స్ అధికారి మధబాబును సంప్రదించాలని పేర్కొన్నారు.

రైళ్లు ఆగాలి.. నిధులు రావాలి



మంచిర్యాల రైల్వేస్టేషన్

- 31నుంచి కేంద్ర బడ్జెట్ సమావేశాలు
- లోక్‌సభ ఎన్నికల ముందు నిధులపై ఆశలు
- గత ఐదేళ్లలో ఎంపీ చొరవ అంతంతే
- సమస్యలు పరిష్కరించాలని కోరుతున్న ప్రజలు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: లోక్‌సభ ఎన్నికలకు ముందు కేంద్ర ప్రభుత్వం 2024–25 ఆర్థిక సంవత్సరానికి మధ్యంతర కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. ఈ నెల 31నుంచి పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు ప్రారంభమై.. వచ్చే నెల 9వరకు సాగనున్నాయి. వచ్చే నెల ఒకటిన మధ్యంతర బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. ఈ క్రమంలో జిల్లా వ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న అనేక పెండింగ్ పనులు, అభివృద్ధికి సంబంధించి ఏళ్లుగా ముందుకు సాగడం లేదు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఈసారి నిధులు ప్రకటించడంతోపాటు పలు హామీలు దక్కుతాయని జిల్లావాసులు ఆశిస్తున్నారు.

జాతీయ రహదారుల నిర్మాణం

జిల్లాలో ప్రస్తుతం మంచిర్యాల నుంచి చంద్రాపూర్ వరకు చేపట్టిన ఎన్‌హెచ్–363 నిర్మాణ పనులు దాదాపు పూర్తవుతున్నాయి. ఇక ఆర్మూర్ నుంచి జగ్దల్‌పూర్ మంచిర్యాల, జైపూర్, భీమారం, ప్రాణహిత మీదుగా చేపట్టిన ఎన్‌హెచ్–63 పనులు ఇంకా అసంపూర్తిగానే మిగిలి ఉన్నాయి. జిల్లా కేంద్రంలో బైపాస్ నిర్మాణంపై స్పష్టత రావడం లేదు. అంతేగాక కొత్త అలైన్‌మెంటు కొలిక్కి వస్తే ఈ ఆర్థిక సంవత్సరంలోనైనా పనులు ప్రారంభించాల్సి ఉంది. ఎన్‌హెచ్–163జీ మంచిర్యాల–వరంగల్ వయా మంథని మీదుగా నిర్మించాల్సిన జాతీయ రహదారి గత ఏడాది ఆమోదం పొందగా, ఇంకా భూ సేకరణ పూర్తి చేయాల్సి ఉంది. బెల్లంపల్లి–గడ్చిరోలీ మధ్య జాతీయ రహదారి నిర్మాణం ప్రారంభం కావాల్సి ఉంది. రోడ్డుకు ఈ బడ్జెట్‌లోనే నిధులు కేటాయిస్తే త్వరితగతిన పూర్తయ్యే అవకాశం ఉంది.

రైళ్ల నిలుపుదల.. స్టేషన్ల అభివృద్ధి

ఉత్తర, దక్షిణ భారతదేశానికి కీలక రైలుమార్గంలో ఇప్పటికీ అనేక రైళ్ల నిలుపుదలకు నోచుకోవడం లేదు. కోవిడ్ సమయంలో నిలిపి మళ్లీ తాత్కాలికంగా పునరుద్ధరించారు. వీటిని శాశ్వత నిలుపుదల చేయాల్సి ఉంది. ఇంకా మూడో లైన్ పూర్తి స్థాయిలో అందుబాటులోకి రాలేదు. దీంతో తరచూ రైళ్లు తాత్కాలికంగా రద్దు చేస్తున్నారు. పనులు ఎప్పుడో పూర్తి కావాల్సి ఉన్నా జాప్యం జరుగుతోంది. క్యాతనపల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి పూర్తి చేయాల్సి ఉంది. రేచినీ వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాల్సి ఉంది. 'అమృత్' పథకంలో మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న ఆధునీకరణ పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఎస్కలేటర్, టికెట్ కౌంటర్లు, మూడో ఫ్లాట్‌ఫారం వైపు పనులు పూర్తి చేయాల్సి ఉంది. స్టేషన్ ఆవరణలోనూ ఇంకా పనులు పెండింగ్‌లో ఉన్నాయి. స్టేషన్ రెండో వైపు టికెట్ బుకింగ్ కౌంటర్లు ఇంకా ప్రారంభం కాలేదు. రవీంద్రఖని, మందమర్రి, బెల్లంపల్లి, రేచినీరోడ్ స్టేషన్లలో ప్రయాణికులకు సరైన సౌకర్యాలే లేవు. ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తే ఇక్కడి రైలు ప్రయాణికులు కష్టాలు తీరనున్నాయి. సూపర్ ఫాస్ట్ రైళ్ల నిలుపుదల, కాజీపేట, వరంగల్, కరీంనగర్‌కు కొత్త రైళ్లు అందుబాటులోకి తేవాలనే డిమాండ్లు అలాగే మిగిలిపోతున్నాయి.

పరిశ్రమలు, నైపుణ్య శిక్షణ సంస్థలు

బొగ్గు, సిమెంట్, సిరామిక్స్, తదితర పరిశ్రమలతో పారిశ్రామిక ప్రాంతంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ స్థానిక యువతకు ఉపాధి లభించడం లేదు. కేంద్రం చొరవ చూపాలని కోరుతున్నారు. జిల్లా కేంద్రంలో ఎంసీసీ వంటి సిమెంట్ కంపెనీ మూతపడడంతో ఉపాధికి దూరమయ్యారు. ఈ క్రమంలో పాత పరిశ్రమల పునఃరుద్ధరణతోపాటు పట్టణాల్లో నైపుణ్య శిక్షణ కేంద్రాలు నెలకొల్పాలనే డిమాండ్లు వస్తున్నాయి. అటవీ అనుమతులు రాక, చాలా చోట్ల రోడ్డు నిర్మాణాలకు వీలు కావడం లేదు. వామపక్ష ప్రభావం ఉన్న చోట్ల రోడ్లు నిర్మించేందుకు కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ నుంచి అనుమతులు రావాల్సి ఉంది. విద్య, వైద్యపరంగా కేంద్ర ప్రభుత్వ నుంచి తోడ్పాటు అందాల్సి ఉంది.

గని కార్మికులకు పన్ను మినహాయింపు

సింగరేణి బొగ్గు గని కార్మికులకు ఆదాయ పన్ను మినహాయింపు ఇవ్వాలనే డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. ప్రతీ బడ్జెట్‌లో ఎదురు చూస్తున్నప్పటికీ హామీ రాక నిరాశ పడుతున్నారు. ఆదాయపన్ను పూర్తిగా కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉండడంతో ఈ బడ్జెట్‌లోనైనా బొగ్గు గని కార్మికులకు పన్ను మినహాయింపు ఇవ్వాలని కోరుతున్నారు. సింగరేణి కంపెనీ వ్యాప్తంగా 30వేల మంది కార్మికులకు ఆదాయపన్ను మినహాయింపుతో ఊరట కలుగనుంది.

ఎంపీ చొరవేదీ?

పెద్దపల్లి లోక్‌సభ నియోజకవర్గం నుంచి గెలుపొందిన బీఆర్‌ఎస్ పార్టీ ఎంపీ బొర్లకుంట వెంకటేశ్ నేత తాను ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గానికి నిధులు తీసుకురావడంలో విఫలమయ్యారనే విమర్శలు ఉన్నాయి. గడిచిన ఐదేళ్ల కాలంలో ఆయన కేంద్ర ప్రభుత్వం నుంచి ఈ నియోజకవర్గానికి ప్రత్యేక నిధులు రాబట్టలేకపోయారు. ఇక్కడి సమస్యల ప్రస్తావన, అభివృద్ధి చేయడంలోనూ చొరవ చూపలేకపోయారనే విమర్శలు వస్తున్నాయి. ఈ క్రమంలో పదవీ చివరి అంకంలోనైనా చొరవ చూపాలని కోరుతున్నారు.

రోడ్డు విస్తరణకు సహకరించాలి

- ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు
- హమాలీవాడ రహదారి విస్తరణ వివాదానికి తెర



రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణంలోని టూటౌన్ ప్రాంతమైన హమాలీవాడ నుంచి తిలక్‌నగర్ వరకు రోడ్డు విస్తరణ పనులకు సహకరించాలని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు కాలనీవాసులను కోరారు. ఏడాదిన్నర క్రితం విస్తరణ పనులు ప్రారంభం కాగా పలువురు అడ్డుకోవడంతో ముందుకు సాగలేదు. శనివారం ఎమ్మెల్యే పర్యటించి పనులు అడ్డుకోవద్దని, ప్రభుత్వ పరంగా అండగా ఉంటామని, ఆటంకం కలిగిస్తే మున్సిపల్ చట్టపరంగా ముందుకెళ్తామని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో నిర్ణయించిన మేరకు 55ఫీట్లతో రోడ్డు వేయాలని మున్సిపల్ అధికారులకు ఆదేశించారు. మరో ఐదు ఫీట్ల మేర తగ్గించాలని కొందరు ఎమ్మెల్యేను కోరగా.. తగిస్తూ వెళ్తే డ్రెయినేజీ, తాగునీటి పైపులైన్, విద్యుత్ స్తంభాలు ఎక్కడ వేస్తారని ప్రశ్నించారు. బాధితులకు ప్రభుత్వం నుంచి పరిహారం ఇప్పించేందుకు కృషి చేస్తానని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్, కౌన్సిలర్లు రావుల ఉప్పలయ్య, నల్ల శంకర్, పోరెడ్డి రాజు, బుద్దార్థి సత్తమ్మ, సల్ల మహేశ్, ఎండీ.మాజీద్, వేములపల్లి సంజీవ్, మున్సిపల్ డీఈ మధుకర్, ఏఈ రాజేందర్ పాల్గొన్నారు.

లహరి బస్సుల ప్రారంభం

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల నుంచి హైదరాబాద్‌కు వెళ్లే లహరి(స్లీపర్ బస్సు) బస్సులను ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు శనివారం ప్రారంభించారు. నాలుగు ఏసీ స్లీపర్‌తోపాటు రాజధాని, మూడు ఎక్స్‌ప్రెస్ బస్సులు మంచిర్యాల డిపోకు చేరాయి. స్లీపర్ బస్సును ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో డీఎం రవీంద్రనాథ్, అసిస్టెంట్ డిపో మేనేజర్ దేవపాల పాల్గొన్నారు.

ఇక నాలుగు రోజులే..!

- ముగియనున్న ఈకేవైసీ నమోదు గడువు
- ఈ నెల 31వరకు అవకాశం
- ఉమ్మడి జిల్లాలో ఇంకా 6.56 లక్షల మంది అప్‌డేట్ చేసుకోలే..



వేలిముద్ర వేసి ఈకేవైసీ చేస్తున్న లబ్ధిదారులు

కైలాస్‌నగర్/మంచిర్యాలటౌన్: బోగస్ రేషన్ కార్డుల ఏరివేతతోపాటు మరణించిన, శాశ్వతంగా వలసవెళ్లిన వారి పేర్లు తొలగించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం రేషన్ ఈకేవైసీ నమోదుకు శ్రీకారం చుట్టింది. గతేడాది సెప్టెంబర్‌లో ప్రారంభించగా, ఈ నెలాఖరుతో గడువు ముగియనుంది. మరో నాలుగు రోజులే మిగిలి ఉండగా, ఇంకా లక్షలాది మంది అప్‌డేట్ చేసుకోలేదు. గడువు పెంపుపై ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలూ రాలేదు. అప్‌డేషన్ చేసుకోకుంటే బి య్యం పంపిణీకి బ్రేక్ పడనుందనే ప్రచారంతో తమ పరిస్థితేంటని మిగిలిన కార్డుదారులు ఆందోళనకు గురవుతున్నారు.

ఈకేవైసీకి దూరంగా 6.56లక్షల మంది

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలో 7,59,228 రేషన్‌కార్డులుండగా అందులో మొత్తం 23,81,218 మంది సభ్యులున్నారు. ఇప్పటి వరకు 17,24,511 మంది కార్డుదారులు ఈకేవైసీ వివరాలను ఆయా జిల్లాల్లోని రేషన్ డీలర్ల ద్వారా నమోదు చేసుకున్నారు. ఇంకా 6,56,706 మంది నమోదు చేసుకోవాల్సి ఉంది. జిల్లాల వారీగా పరిశీలిస్తే.. ఆదిలాబాద్‌లో 1,64,048 మంది, కుమురంభీంలో 1,43,432 మంది, నిర్మల్‌లో 1,52,557 మంది, మంచిర్యాలలో అత్యధికంగా 1,96,669 మంది ఇంకా అప్‌డేషన్ చేసుకోలేదు. ఇలాంటి వారిలో ఎక్కువగా వృద్ధులు, చిన్నపిల్లలే ఉన్నారు. ఆధార్ అప్‌డేషన్ చేసుకోలేని వారు కూడా కొంతమంది ఉన్నారు. ప్రభుత్వం గడువు పొడిగించకుంటే వీరంతా నష్టపోయే అవకాశం లేకపోలేదు.

ఆధార్ అప్‌డేషన్ లేకనే..

ఈకేవైసీ పూర్తిస్థాయిలో కాకపోవడానికి కార్డుదారుల ఆధార్ అప్‌డేట్ లేకపోవడమే ప్రధాన సమస్యగా తెలుస్తోంది. వృద్ధులు, చిన్నారుల ఐరీస్ వివరాలు రాకపోవడం కారణంగా చెబుతున్నారు. ఇలాంటి వారు రేషన్‌షాపులకు వెళ్లగా ఆధార్ సెంటర్లకు వెళ్లి తమ వివరాలు అప్‌డేట్ చేసుకోవాలని సూచించడంతో చాలా మంది ఆ ప్రక్రియలో నిమగ్నమయ్యారు. అయితే వారికి సరిపడా టోకెన్లు దొరకపోవడంతో వివరాలు ఇంకా అప్‌డేట్ చేసుకోలేదు. మిగిలిపోయిన వృద్ధులు, చిన్నారుల ఈకేవైసీ నమోదు కోసం రేషన్ డీలర్లు క్షేత్రస్థాయిలోకి వెళ్లి వివరాలు సేకరిస్తున్నా ప్రక్రియ మాత్రం 80శాతం చేరకపోవడం గమనార్హం. ప్రభుత్వం గడువు పొడిగించకుంటే కార్డుదారులు నష్టపోయే అవకాశముందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

జిల్లా	మొత్తం రేషన్ కార్డులు	సభ్యులు	ఈకేవైసీ పూర్తి	శాతం
ఆదిలాబాద్	1,91,770	6,39,246	4,75,198	74.34
ఆసిఫాబాద్	1,39,782	4,60,458	3,17,026	68.95
మంచిర్యాల	2,19,190	6,39,546	4,42,877	69.25
నిర్మల్	2,08,486	6,41,968	4,89,411	76.24

ప్రభుత్వానికి నివేదిస్తాం



తమ పరిధిలోని ప్రతీ కార్డుదారుడి ఈకేవైసీ నమోదు చేసేలా చూడాలని డీలర్లను ఆదేశించాం. వారు క్షేత్రస్థాయికి వెళ్లి కూడా నమోదు చేస్తున్నారు. అయితే ఆధార్ అప్‌డేట్ లేని వారు మిగిలిపోయే అవకాశముంది. వీరితో పాటు ఐరీస్, ఆధార్ వివరాలు లేని వృద్ధులు, చిన్నారుల వివరాలు ప్రత్యేకంగా సేకరించాలని సూచించాం. వాటిని ప్రత్యేకంగా నమోదు చేసుకుని ఉన్నతాధికారులకు నివేదిస్తాం. ప్రభుత్వ ఆదేశానుసారం ప్రతి కార్డుదారుడు తప్పనిసరిగా ఈకేవైసీ నమోదు చేసుకోవాల్సిందే.

– కిరణ్‌కుమార్, డీఎస్‌వో, ఆదిలాబాద్

భారీగా సీఐల బదిలీ

- కాళేశ్వరం మల్టీ జోన్ పరిధిలో 25మంది
- లూప్‌లైన్‌లో ఉన్నవారిని వరించిన అదృష్టం



మంచిర్యాలక్రైం: పోలీసు శాఖలో కాళేశ్వరం మల్టీ జోన్–1 పరిధిలో భారీగా సీఐలు బదిలీ అయ్యారు. 25మందిని బదిలీ చేస్తూ మల్టీజోన్ ఐజీ తరుణ్‌జోషి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారిలో జిల్లాకు చెందిన పలువురు ఉన్నారు. ఏళ్ల తరబడి లూప్‌లైన్‌లో విధులు నిర్వర్తిస్తున్న సీఐలను అదృష్టం వరించింది. 2023 జూలై 23న 'సాక్షి'లో 'ఎక్కడోళ్లు అక్కడే' అనే కథనం ప్రచురితం కావడం, ఈసారి జరిగిన సీఐల బదిలీల్లో లా అండ్ ఆర్డర్‌లో అవకాశం దక్కడం గమనార్హం. ఈ బదిలీల్లో రాజకీయ నాయకుల రెకమెండేషన్ లెటర్ లేకుండానే పారదర్శకంగా బదిలీలు జరిగినట్లు తెలుస్తోంది.

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
ఎస్‌డీ.అఫ్జలొద్దీన్	గోదావరిఖని 2టౌన్	బెల్లంపల్లి రూరల్
ఎస్.రాజ్‌కుమార్‌గౌడ్	బెల్లంపల్లి రూరల్	టాస్క్‌ఫోర్స్ రామగుండం
ఎస్.దేవయ్య	సీసీఎస్–3 రామగుండం	బెల్లంపల్లి–1టౌన్
ఆర్.బన్సీలాల్	బెల్లంపల్లి–1టౌన్	శ్రీరాంపూర్
జీ.రమేష్‌బాబు	శ్రీరాంపూర్	సీఎస్‌బీ–4 రామగుండం
డీ.సుధాకర్	టాస్క్‌ఫోర్స్–2పెద్దపల్లి	చెన్నూర్‌రూరల్
సీహెచ్.విద్యాసాగర్	చెన్నూర్ రూరల్	మల్టీజోన్–1 ఐజీపీ ఆఫీస్
కే.రవీందర్	సీసీఎస్ రాజన్న సిరిసిల్ల	చెన్నూర్ టౌన్
ఎస్.వాసుదేవరావ్	చెన్నూర్‌టౌన్	మల్టీజోన్–1 ఐజీపీ ఆఫీస్
బీ.రవి	పీసీఆర్ ఆదిలాబాద్	మందమర్రి
జీ.మహేందర్‌రెడ్డి	మందమర్రి	మల్టీజోన్–1 ఐజీపీ ఆఫీస్
ఆర్.క్రిష్ణ	లక్సెట్టిపేట	పెద్దపల్లి
ఏ.అశోక్	సీసీఆర్‌బీ రామగుండం	మంచిర్యాల రూరల్
టీ.సంజీవ్	మంచిరాల్య రూరల్	మల్టీజోన్–1 ఐజీపీ ఆఫీస్
కే.ప్రేమ్‌కుమార్	నార్నూర్	సీఎస్‌బీ–2 మంచిర్యాల
జీ.మోగిలి	సీఎస్‌బీ–2 మంచిర్యాల	సీఎస్‌బీ కరీంనగర్
ఎం.రాజు	మంచిర్యాల	మల్టీజోన్–1 ఐజీపీ ఆఫీస్

సమ్మక్క జాతరపై నిర్లక్ష్యం

- ఆదాయం ఉన్నా వసతులు అంతంతే..
- ప్రారంభం కాని పనులు
- గోదావరి నది పరీవాహకంలో వ్యర్థాలు



కూలిపోయిన గదులు

మంచిర్యాలఅర్బన్: జిల్లా కేంద్రం మంచిర్యాలలోని గోదావరి నదీ తీరాన రెండేళ్లకోసారి నిర్వహించే సమ్మక్క–సారలమ్మ జాతరపై నిర్లక్ష్యం కనిపిస్తోంది. ఈ ఏడాది జాతర(ఫిబ్రవరి 21 నుంచి 24)కు నెల రోజులే ఉన్నా వనదేవతల జాతరపై ప్రతిష్టంభన కొనసాగుతోంది. జాతర సమయంలో మినహా అధికారులు వనదేవతల గద్దెల ప్రాంతం వైపు కన్నెత్తి చూడకపోవడంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. రూ.లక్షల్లో ఆదాయం సమకూరుతున్నా వసతుల కల్పనలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. గోదావరి నది ఎటు చూసినా వ్యర్థాలతో నిండిపోయి కనిపిస్తోంది. నిండుకుండలా మారిన గోదావరిలో నీరు లేకపోవడంతో ప్లాస్టిక్ వ్యర్థాలు, సమాధుల నిర్మాణాలు బయటపడి కళావిహీనంగా మారింది. ఓ వైపు సమ్మక్క–సారలమ్మ జాతర పనులు సాగకపోగా.. గోదావరి ఘోషిస్తోంది.

వసతులేవి..?

జాతరతో ఆదాయం సమకూరుతున్నా భక్తులకు సౌకర్యాల కల్పనపై నిర్లక్ష్యం వహిస్తున్నారు. 20ఏళ్ల క్రితం ఇక్కడ జాతర ప్రారంభం కాగా స్థానికులతోపాటు మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు వస్తుంటారు. మొదట్లో ఐదుసార్లు నిర్వహించిన జాతర నిధులపై లెక్కాపత్రాలు లేకుండాపోయాయి. తర్వాత కాలంలో 2021లో రూ.7లక్షలు, 2014లో రూ.9.13లక్షలు, 2016లో రూ.10.28లక్షలు, 2018లో రూ.12లక్షలకు పైగా ఆదాయం వచ్చింది. 2020లో రూ.20,56,510 ఆదాయం రాగా అన్ని ఖర్చులు పోనూ రూ.6,24,510 మిగులు చూపారు. 2022లో రూ.23,68,315 జాతర ఆదాయం రాగా సమ్మక్క గద్దెల నిర్మాణం ఇతరత్రా ఖర్చులు పోనూ రూ.12.50లక్షలు ఆదాయం బ్యాంకు ఖాతాలో ఉన్నాయి. జాతర నిర్వహణ దేవాదాయ శాఖ పర్యవేక్షిస్తూ వస్తోంది. నిధుల వ్యయమంతా ఆ శాఖ చూస్తుండగా భక్తులకు కల్పించే సౌకర్యాలు, విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్య పనుల బాధ్యతను పురపాలక సంఘం నిర్వహిస్తోంది. ఇప్పటివరకు కనీస సౌకర్యాలపై కూడా దృష్టి సారించలేదు. కాళేశ్వరం ప్రాజెక్టులో నీటిని వదిలిపెట్టడంతో గోదావరి నదిలో నీరు లేకుండాపోయింది.



అపరిశుభ్రంగా అమ్మవారు కొలువుదీరనున్న గద్దెలు



స్నానఘట్టాల వద్ద పాకురు

అన్ని సౌకర్యాలు కల్పిస్తాం..

వన దేవతల జాతరకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తాం. స్థానిక శాసనసభ్యుడు ప్రేమ్‌సాగర్‌రావు సూచనల మేరకు మహా జాతర నిర్వహిస్తాం. అన్ని శాఖల సహాయ సహకారాలు తీసుకుంటాం. ఫిబ్రవరి 15లోపు పనులు పూర్తి చేస్తాం.

– ముక్తా రవి, ఈవో

ఇక రెండు వైపులా జాతర

సమ్మక్క–సారలమ్మ జాతర గోదావరి నదికి రెండు వైపులా సాగనుంది. రెండేళ్ల తర్వాత గోదావరి నదిలో నీటిప్రవహం లేకపోవడంతో గతంలో మాదిరిగా తక్కువగా నీటి ప్రవహం ఉండడంతో అవతలి వైపు గోలివాడ జాతరకు వెళ్లే అవకాశాలు కనిపిస్తున్నాయి. అటు గోలివాడ, ఇటు మంచిర్యాల నదీ తీరాన నిర్వహించే జాతరకు భక్తులు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, తదితర ప్రాంతాల నుంచి తరలివస్తారు. భక్తులు గోదావరి నదిలోనే తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేసుకుని బస చేయనున్నారు దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం మొక్కుబడిగా కాకుండా గోదావరి నది పరీవాహక ప్రాంతమంతా శుభ్రం చేయడంతోపాటు బట్టలు మార్చుకునేందుకు గదులు ఏర్పాటు చేయాలి. నదిలో స్నానాలు చేసేలా వ్యర్థాలను తొలగించాల్సి ఉంది. భక్తుల సౌకర్యార్థం స్థలాన్ని చదును చేయడం నుంచి మొదలుకుని వ్యర్థాలు తొలగించే పనులు ఇప్పటికిప్పుడు మొదలు పెట్టినా జాతర గడువు వరకు పూర్తవుతాయో లేదో చెప్పలేని పరిస్థితి నెలకొంది. జాతర కో–ఆర్డినేషన్ సమావేశం(అధికారులతో సమీక్షా) వెంటనే ఏర్పాటు చేసి పనులు వేగవంతం చేయాలని పలువురు కోరుతున్నారు.

నదీస్నానం చేయాలంటే..

ఇదివరకు గోదావరి నదిలో నీటి ప్రవాహం ఉండడంతో స్నానఘట్టాల వద్ద భక్తులు పవిత్ర స్నానాలు చేసేవారు. ప్రస్తుతం నీరు లేకపోవడంతో కిలోమీటర్ల దూరం వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. నిండుగా కనిపించిన గోదావరి నీరు లేక ప్లాస్టిక్ కవర్లు, వ్యర్థాల దృశ్యాలే కనిపిస్తున్నాయి. దూరంగా నీరు కనిపిస్తున్నా వెళ్తే స్నాన అనంతరం వెనక్కి వస్తామా లేదా అనే భయం భక్తులను వెంటాడుతోంది. జలప్రవాహం లేనప్పుడు ఒండ్రుమట్టి, బురద ఉండడం సహజమే. ఈ ఏడాది గోదావరి అవతలి వైపు ప్రవహిస్తుండడంతో ఆకాశగంగ(కుళాయి) స్నానం వైపు మొగ్గు చూపే అవకాశాలు లేకపోలేదు. స్నానఘట్టాలపై పాకురుపట్టి జారుతోంది. విద్యుత్ సౌకర్యం నుంచి మొదలుకుని మరుగుదొడ్లు, దుస్తులు మార్చుకునే గదులకు రంగులు వేయడం తదితర పనులు సాగడం లేదు. గోదావరి నదికి వచ్చే భక్తులు వినియోగించిన పూజాద్రవ్యాలు, చెత్తాచెదారాలు సమీపంలో దహనం చేసిన వ్యర్థాలన్నీ నదిలోనే దర్శనమిస్తున్నాయి. అడుగు వేయలేని స్థితిలో బురదతో కలిసిన వ్యర్థాలు భక్తుల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నాయి.

క్లుప్తంగా

బెల్లంపల్లి నర్సరీలోని పూల తోటల వేలం

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ ఐటీడీఏ పరిధిలోని బెల్లంపల్లి ఉద్యాన నర్సరీ(రోజ్ గార్డెన్)లో సాగు చేస్తున్న చామంతి, బంతి పూల తోటలను వేలం వేయనున్నట్లు ఐటీడీఏ ఇంచార్జి పీవో ఖుష్బూ గుప్తా ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 2న ఉదయం 11గంటలకు బెల్లంపల్లిలోని ఐటీడీఏ ఉద్యాన నర్సరీ(రోజ్ గార్డెన్)లో వేలం పాట నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఒక ఎకరంలో సాగు చేసిన చామంతి, బంతిపూల తోటలను ఒక సీజన్(మూడు నెలలకు)కు వేలం నిర్వహిస్తామని తెలిపారు. ఆసక్తి కలిగిన వ్యాపారులు, పూలకొట్టు దుకాణదారులు, రైతులు పాల్గొనాలని సూచించారు. వివరాలకు ఉట్నూర్ ఐటీడీఏ ప్రాజెక్టు ఉద్యాన అధికారి కార్యాలయంలో లేదా ఉద్యాన అధికారి హెచ్‌వోను 9032313933 నంబరులో సంప్రదించాలని కోరారు.

జాతీయ స్థాయి అవార్డుకు ఎంపిక


అవార్డుతో శివకుమార్

లక్సెట్టిపేట: పట్టణానికి చెందిన ప్రముఖ పిడియాట్రిక్ వైద్యుడు కాశం శివకుమార్ జాతీయస్థాయి అవార్డుకు ఎంపికయ్యారు. కేరళలోని కొచ్చిలో శుక్రవారం జరిగిన జాతీయ శిశు వైద్యుల సదస్సులో అవార్డు అందుకున్నారు. తల్లిపాల వారోత్సవాలు, చిన్నపిల్లల సంరక్షణపై కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించినందుకు అవార్డుకు ఎంపికైనట్లు ఆయన పేర్కొన్నారు.

వివాహిత బలవన్మరణం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): క్షణికావేశంలో పురుగుల మందు తాగి వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై నరేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం లక్సెట్టిపేట మండలం మిట్టపల్లి గ్రామానికి చెందిన బ్యారి ఉమ(43)కు హాజీపూర్ మండలం సబ్బెపల్లికి చెందిన లచ్చయ్యతో 27 ఏళ్ల క్రితం వివాహమైంది. లచ్చయ్య ఇటీవల వ్యవసాయ పనులు పట్టించుకోకుండా ఉమతో గొడవ పడుతూ ఉండేవాడు. శుక్రవారం కూడా మరోసారి గొడవ జరిగింది. దీంతో క్షణికావేశానికి గురై ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు మంచిర్యాలలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందింది. క్షణికావేశంలో ఆత్మహత్యకు పాల్పడిందని మృతురాలి సోదరుడు మచ్చ కోటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎయిడ్స్ నియంత్రణ సంస్థకు పురస్కారం


మాట్లాడుతున్న టీఎన్జీవోస్ సభ్యులు

మంచిర్యాలటౌన్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలో హెచ్ఐవీ ఎయిడ్స్ నియంత్రణలో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నందుకు జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థకు రాష్ట్రస్థాయి అవార్డు లభించింది. కుటుంబ సంక్షేమ శాఖ కార్యాలయం హైదరాబాద్‌లో శనివారం రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కే.హైమావతి చేతుల మీదుగా జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి వి.అనిల్‌కుమార్ సంస్థ సిబ్బందితో కలిసి అవార్డు అందుకున్నారు.

ఒకరి అదృశ్యం

దహెగాం: మండలంలోని కొత్మీర్ గ్రామానికి చెందిన పిల్లల మహేందర్ అదృశ్యమయ్యాడని ఎస్సై సనత్‌కుమార్ శనివారం తెలిపారు. 20 రోజుల క్రితం ఇంట్లో నుంచి వెళ్లపోయాడు. ఆచూకీ లభించకపోవడంతో అతని భార్య అనసూర్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

నీ వెంటే నేను...

గుడిహత్నూర్/కైలాస్‌నగర్: వారి వయసు 25 ఏళ్లలోపే... ఇరువురి రాష్ట్రాలు వేరైనా అగ్నిసాక్షిగా మూడుముళ్లతో ఒక్కటైన ఆ బంధం ఎనిమిది నెలలకే చితికిపోయింది. కొంత కాలం అన్యోన్యంగా సాగిన వారి కాపురం.. ఇంతలో ఏం జరిగిందో తెలియదు కానీ ఆ నవ దంపతులు తమ జీవితాలకు ముగింపు పలికారు. క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయంతో ఇరు కుటుంబాల్లో తీవ్ర విషాదం మిగిల్చారు. పెళ్లిలో ఏడడుగులు నడిచి జీవితాంతం కలిసే ఉంటామని ఆశపడ్డ ఆ జంట చావులోనూ ఒక్కటై జీవితానికి ముగింపు పలికారు. గంట వ్యవధిలోనే నవ దంపతులు ఆత్మహత్యకు పాల్పడిన ఘటనతో గుడిహత్నూర్ మండలం కొల్హారీలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

- క్షణికావేశంలో భార్య.. తట్టుకోలేక భర్త
- 8 నెలలకే తనువు చాలించిన దంపతులు
- ఒకే చితిపై ఇద్దరి దహన సంస్కారాలు
- కొల్హారీ గ్రామంలో విషాదఛాయలు

అత్తారింటికి వచ్చి ఆత్మహత్య...

గుడిహత్నూర్ మండలంలోని కొల్హారీ గ్రామానికి చెందిన శేవాళే విజయ్ (24)కు మహారాష్ట్రలోని బుల్హా గ్రామానికి చెందిన పల్లవి (20)తో గతేడాది మే 22న వివాహం జరిగింది. విజయ్ తనకున్న 14 ఎకరాల్లో వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. విజయ్ నాన్న ఐదేళ్ల క్రితం మృతి చెందాడు. అమ్మ పుష్పాబాయి, ఐదుగురు అక్కాచెల్లెళ్లు ఉన్నారు. వీరందరికీ పెళ్లిళ్లు అయ్యాయి. అందరూ ఎంతో సంతోషంగా ఉంటున్నారు. ఈ


విజయ్ మృతదేహం


పల్లవి మృతదేహం

క్రమంలో సంక్రాంతికి పుట్టింటికి వెళ్లిన పల్లవి శుక్రవారం తన సోదరుడు కృష్ణతో కలిసి కొల్హారీకి చేరుకుంది. వీరి రాక విషయం తెలుసుకున్న విజయ్ బావమరిదితో కలిసి భోజనం చేసి ఆయనను గుడిహత్నూర్ వరకు సాగనంపాడు. అనంతరం చేనుకు వెళ్లి పనిలో నిమగ్నమయ్యాడు. ఇంట్లో ఒంటరిగా ఉన్న పల్లవి తన గదిలో పురుగుల మందుతాగింది. స్థానికులు విజయ్‌కు సమాచారమందించి ఆటోలో రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.

గంట వ్యవధిలోనే భర్త...

పుట్టింటికి వెళ్లి వచ్చిన భార్య పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడడంతో విజయ్ తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. భార్య మరణం తట్టుకోలేక అక్కడి నుంచి జిల్లా కేంద్రంలోని తిర్పెల్లి స్మశాన వాటికకు వెళ్లి ఫోన్ స్విచ్‌ఆఫ్ చేసుకున్నాడు. తనతో తెచ్చుకున్న పురుగుల మందు తాగి ఫోన్ ఆన్ చేశాడు. కుటుంబ సభ్యులు ఫోన్ చేయడంతో వారితో విషయం చెప్పాడు. కుటుంబ సభ్యులు అపస్మారస్థితిలో పడి ఉన్న విజయ్‌ను రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో ఇరు కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది.

ఒకే చితిపై ఇద్దరు..

విషయం తెలుసుకున్న కొల్హారీ గ్రామస్తులు శుక్రవారం రాత్రి నుంచీ రిమ్స్‌లో పడిగాపులు కాస్తూ తోచిన సహాయం చేశారు. పల్లవి మృతికి కారణాలు తెలియకపోగా విజయ్ తన భార్య లేకుండా నేనెలా ఉండగలను. సమాజానికి నేనేం చెప్పాలి? అని మనోవేదనకు గురై ఆత్మహత్య చేసుకున్నట్లుగా గ్రామస్తులు చెబుతున్నారు. ఇరువురి మృతదేహాలకు పోలీసులు రిమ్స్‌లో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. శనివారం సాయంత్రం కొల్హారీలోని విజయ్ చేనులో ఒకే చితిపై ఇద్దరి అంత్యక్రియలు నిర్వహించారు.

మూడు తరాలుగా...

విజయ్ కుటుంబంలో మూడు తరాలుగా ఆత్మహత్యలు కొనసాగుతున్నాయి. విజయ్ తండ్రి ప్రకాష్, తాత సైతం పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నారు. ఏ దేవుడి శాపమో మా వారసులకు పురుగుల మందు యమపాశమై పడుతోందని విజయ్ అక్కా చెల్లెళ్లు రోదిస్తున్న తీరు గ్రామస్తులను కంటతడి పెట్టించింది.

‘కోలిండియా పోటీల్లో పతకాలు సాధించాలి’


క్రీడాదుస్తులు అందజేస్తున్న జీఎం రవిప్రసాద్

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణి క్రీడాకారులు కోలిండియా పోటీల్లో పతకాలు సాధించి సంస్థకు పేరు తీసుకురావాలని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ రవిప్రసాద్ అన్నారు. గోలేటి టౌన్‌షిప్‌లోని సీఈఆర్ క్లబ్‌లో శనివారం 2022–23 సంవత్సరంలో నియర్ బై ఏరియా స్థాయి పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులకు క్రీడా దుస్తులు, సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఏరియాలో క్రీడాకారులకు కావాల్సిన అన్నిరకాల వసతులతో కూడిన మైదానాలను అందుబాటులో ఉంచడంతో పాటు వార్షిక క్రీడల్లో రాణిస్తున్న క్రీడాకారులకు దుస్తులు, క్రీడా సామగ్రి అందజేస్తూ మరింత ప్రోత్సహిస్తోందన్నారు. సంస్థ అందిస్తున్న ప్రోత్సాహాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నిరంతర సాధనతో క్రీడా నైపుణ్యాలను మెరుగుపర్చుకుంటూ పోటీల్లో రాణించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి, ఎస్‌వోటూ జీఎం నరేందర్, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, సీనియర్ పీవో ప్రశాంత్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ మురహరిరావు, జనరల్ కెప్టెన్ చంద్రకుమార్, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కుల కోసం పోరాడుతాం


టీబీజీకేఎస్ జెండా ఎగురవేస్తున్న శ్రీనివాస్‌రావు

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణి కార్మికుల న్యాయమైన హక్కుల కోసం నిరంతరం పోరాడుతామని టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు అన్నారు. ఏరియాలోని కైరిగూడ ఓసీపీ, ఏరియా వర్క్‌షాప్, మాదారం టౌన్‌షిప్, గోలేటి టౌన్‌షిప్, బెల్లంపల్లి ప్రాంతాల్లోని యూనియన్ కార్యాలయాల్లో శనివారం టీబీజీకేఎస్ 21వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2002, జనవరి 27న పురుడు పోసుకున్న టీబీజీకేఎస్ సింగరేణి ఉద్యోగులకు 21 సంవత్సరాలుగా ఎనలేని హక్కులు సాధించిందన్నారు. కారుణ్య నియామకాలు తీసుకువచ్చిన ఘనత టీబీజీకేఎస్‌దేనన్నారు. ఉచిత మాస్టర్, ఉచిత విద్యుత్, సకల జనుల సమ్మె కాలానికి వేతనం, ఉద్యోగుల తల్లిదండ్రులకు సైతం కార్పోరేట్ వైద్యం లాంటి ఎన్నో హక్కులను సాధించామన్నారు. ఆయా కార్యక్రమాల్లో సెంట్రల్ కమిటీ నాయకులు మంగీలాల్, ఏరియా నాయకులు చంద్రశేఖర్, సమ్మయ్య, సంపత్, వెంకటేశ్వర్లు, రవీందర్ పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా వాలీబాల్ టోర్నీ ప్రారంభం


టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న నిర్వాహకులు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో శనివారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వాలీబాల్ టోర్నమెంట్ పోటీలను పట్టణ సీఐ రాజు ప్రారంభించారు. ఉమ్మడి జిల్లా నుంచి 32 జట్లు పోటీల్లో పాల్గొనగా, విజేత జట్టుకు రూ.20 వేలు, ద్వితీయ బహుమతి రూ.15 వేలు, తృతీయ బహుమతి రూ.10 వేల నగదు అందయజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్సై విజయ్‌కుమార్, ఆలయ ఫౌండేషన్ సీఈవో మిట్టపల్లి రాజేంద్రకుమార్, కార్యదర్శి మూగ మహేశ్, ట్రినిటి స్కూల్స్ అధినేత బిజుకురివిల్లా, సత్యపాల్ రెడ్డి, ఉమ్మడి జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు నల్ల శంకర్, కార్యదర్శి మైలారం శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు బైరగోని సిద్దయ్య, జిల్లా వ్యాయామ విద్యాసంఘం కార్యదర్శి గాజుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించాలి


కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

ఆదిలాబాద్‌రూరల్: మంచిర్యాల జిల్లా దేవాపూర్‌లోని ఓరియంట్ సిమెంట్ కంపనీ కార్మికసంఘం ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ శనివారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా డెప్యూటీ లేబర్ కమిషనర్ కార్యాలయం ఎదుట కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులు భీంరావ్, సతీష్‌రెడ్డి మాట్లాడుతూ నిబంధనల ప్రకారం రెండేళ్లకోసారి ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నప్పటికీ ఐదేళ్లుగా నిర్వహించడం లేదన్నారు. గతంలో కోర్టును సైతం ఆశ్రయించగా ఎన్నికలు నిర్వహించాలని ఆదేశాలు ఇచ్చినప్పటికీ అమలు చేయడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ అమలులోకి రాక ముందు ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్మికశాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్మికులు రాజయ్య, శ్రీనివాస్, శంకర్, సత్యనారాయణ, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

విపత్తులపై అవగాహన ఉండాలి

- ఎన్‌డీఆర్‌ఎఫ్ సీఐ బిటెన్ సింగ్


విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ సీఐ బిటెన్ సింగ్

మంచిర్యాలక్రైం: విపత్తులు సంభవించినప్పుడు తమను తాము రక్షించుకునే విధానంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని 10వ బెటాలియన్ ఎన్‌డీఆర్‌ఎఫ్ విభాగానికి చెందిన సీఐ బిటెన్ సింగ్ అన్నారు. విపత్తులు సంభవించినప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశాలపై శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వరదలు, నివాస గృహాల్లో వంటగ్యాస్ సిలిండర్ లీకేజీ ప్రమాదం, రోడ్డు ప్రమాదాలు సంభవించినప్పుడు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన రక్షణ చర్యలపై విద్యార్థులకు ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. మంటలను ఎలా ఆర్పాలి, ఒక వ్యక్తి అపస్మారక స్థితిలోకి వెళ్లినప్పుడు చేసే సీపీఆర్ విధానంపై శిక్షణ ఇచ్చారు. ప్రిన్సిపాల్ వీ.చక్రపాణి, అధ్యాపకులు మహాత్మ సంతోష్, ఎన్‌సీసీ అధికారి తిరుపతి, మహేష్, డీవైఎస్‌వో శ్రీకాంత్‌రెడ్డి, కిషోర్‌కుమార్, నర్సింగ్, రెసిడెన్షియల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సీవీరామన్ డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

వెంచర్ల జోరు


హాజీపూర్ మండలం దొనబండ శివారులో అనధికార వెంచర్

- అనుమతులు లేకుండానే ఏర్పాట్లు
- నిబంధనలు ఉండవు.. అమ్మకాలు ఆగవు
- రెచ్చిపోతున్న భూ వ్యాపారులు
- ప్రభుత్వ భూముల నుంచి భారీగా మట్టి తరలింపు
- పట్టింపులేని ఆయా శాఖల అధికారులు
- ఆదాయం కోల్పోతున్న పంచాయతీలు



ఈ చిత్రంలో కనిపిస్తున్న వెంచర్ హాజీపూర్ మండల శివారులోని ఓ వ్యవసాయ క్షేత్రంలో ఇటీవల వెలిసింది. రియల్ భూమ్‌తో పచ్చని పొలాన్ని వెంచర్‌గా చేసేశారు. ఎలాంటి అనుమతులు లేకుండానే ఏకంగా రోడ్లు వేస్తూ ప్లాటింగ్ చేస్తున్నారు. జాతీయ రహదారి–63కు కూతవేటు దూరంలో వేస్తున్న ఈ వెంచర్ సరిగా కానరాకపోవడంతో రియల్ వ్యాపారులు ఇదే అదనుగా అనుమతులు లేకుండానే స్థలాల విక్రయాలు చేపడుతున్నారు. పంచాయతీ ఈ వెంచర్‌లో ప్లాట్ కొనుగోలు చేస్తే ఇంటి అనుమతులు ఇవ్వబడవని స్పష్టంగా తెలియజేస్తున్నా వెంచర్ నిర్వాహకులు మాత్రం అమాయక ప్రజలను మోసం చేస్తూ స్థలాలు అమ్ముతున్నారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల జిల్లాలో రియల్ వ్యాపారం జోరు ఇటీవల పెరుగుతోంది. పల్లె, పట్నం అనే తేడా లేకుండా ఇష్టారాజ్యంగా అక్రమ లేఅవుట్‌లు వెలుస్తుండడమే ఇందుకు కారణం. అనధికార లేఅవుట్ స్థలాల్లో ఇంటి నిర్మాణాలకు అనుమతులు ఇవ్వకూడదని తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం స్పష్టంగా తెలియజేస్తోంది. అయినా హాజీపూర్ మండల పరిధిలోని వేంపల్లి, ముల్కల్ల, గుడిపేట, రాపల్లి, హాజీపూర్, దొనబండ గ్రామాల్లోని శివారు ప్రాంతాల్లో అక్రమ వెంచర్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. ఫలితంగా జీపీల ఆదాయానికి గండిపడుతోంది. రాజకీయ అండదండలతో వెలుస్తున్న వెంచర్లపై చర్యలు ఉండటం లేదని, రియల్ వ్యాపారులు తమ పలుకుబడిని చూపిస్తూ అధికారులు చర్యలకు పాల్పడకుండా చూస్తున్నట్లు కూడా విమర్శలకు తావిస్తోంది. నాలా కన్వర్షన్ చేసిన మీదట లేఅవుట్ అనుమతి వచ్చిన తర్వాత ప్లాట్లు తయారు చేయాలి. కానీ ప్రైవేట్ ఇంజినీర్లు, సర్వేయర్ల సహకారంతో హద్దురాళ్లు, సిమెంట్ పోల్స్ పాతుతున్నారు. గజాల చొప్పున అమ్మాల్సిన ప్లాట్లను గుంటల చొప్పున ఫామ్ ల్యాండ్స్ పేరుతో కూడా విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో ప్లాట్లు కొనుగోలు చేసిన వినియోగదారులు చాలా ఇబ్బందుల పాలవుతున్నారు. పంచాయతీలకు కేటాయించాల్సిన 10 శాతం భూమిని కూడా అనధికార వెంచర్ల ద్వారా మిగుల్చుకుని అమ్మేసుకుంటున్నారు. అనుమతులు లేకుండా జోరుగా వ్యాపారం సాగిస్తున్న వారిపై అధికారులు చర్యలు ఎందుకు చేపట్టడంలేదని పలువురు ప్రశ్నిస్తున్నారు.

ప్రభుత్వ భూముల్లోంచి మట్టి..

తాజాగా వేంపల్లి శివారులో ఓ ఐదెకరాల అనధికారిక వెంచర్ ఏర్పాటు వేగంగా చేపడుతున్నారు. ఒక్కసారిగా ఈ వెంచర్ ఏర్పాటులో నిమగ్నమైన రియల్ వ్యాపారులు వెంచర్‌ను మొత్తం మట్టితో నింపేశారు. ఈ మట్టి అంతా కూడా వేంపల్లి శివారులోని ప్రభుత్వ భూమి అయిన సర్వే నంబర్ 159 నుంచి ఏకంగా 600 ట్రిప్పుల మట్టిని తోడేసి వెంచర్‌లో నింపేశారు. మరో 1000 ట్రిప్పుల వరకు మట్టిని తరలించేందుకు సిద్ధంగా ఉన్నారు. ఈ విషయమై హాజీపూర్ తహసీల్దార్ సతీశ్‌కుమార్‌ను సంప్రదించగా ప్రభుత్వ భూమి నుంచి అనుమతి లేకుండా మట్టి తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. వాహనాలు సీజ్ చేసి జరిమానా విధిస్తామన్నారు.

నిబంధనలు ఇలా..

- వ్యవసాయ భూమిలో లే అవుట్ చేయాలంటే మొదట భూమి విలువలో మూడు శాతం రుసుము రెవెన్యూ శాఖకు చెల్లించి నాలా(వ్యవసాయేతర భూమి)గా మార్చుకోవాలి. ఆ తర్వాత డీటీసీపీ ద్వారా అనుమతులు పొంది లే అవుట్ చేయాల్సి ఉంటుంది.
- పట్టణాల్లో మున్సిపాలిటీ, గ్రామాల్లో పంచాయతీల అనుమతి తీసుకోవాలి. జిల్లా స్థాయిలో డీటీసీపీ నుంచి లే అవుట్ అనుమతి తీసుకోవాలి.
- వెంచర్‌లో పదిశాతం ఆయా జీపీలకు లేదా మున్సిపాలిటీలకు అప్పగించాల్సి ఉంటుంది.
- వీధి దీపాలు, మురికి కాలువలు, రహదారుల ఏర్పాటు, విద్యుత్ సౌకర్యం, నీటి ట్యాంకు నిర్మాణం చేపట్టాల్సి ఉంటుంది.

అనుమతిలేని వెంచర్లలో కొనవద్దు

ఎలాంటి అనుమతులు లేకుండా వెంచర్లు ఏర్పాటు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవు. ఇప్పటికే నోటీసులు పంపించాం. వెంచర్లలో అనుమతులు లేకుండా హద్దురాళ్లు ఏర్పాటు చేస్తే తొలగిస్తాం. ప్రజలు కూడా అనుమతు లేని వెంచర్లలో స్థలాలు కొని ఇబ్బందులు పడవద్దని సూచిస్తున్నాం.
– శ్రీనివాసరెడ్డి, ఎంపీవో, హాజీపూర్

టీఎన్జీవోస్ సభ్యత్వ నమోదు పూర్తి

మంచిర్యాలటౌన్: టీఎన్జీవోస్ ఎన్నికల కోసం జిల్లాలోని ఆరు తాలూకా యూనిట్లకు ఎన్నికల షెడ్యూల్ ఇది వరకే విడుదల కాగా, ఆరు తాలూకా యూనిట్లలో సభ్యత్వం పూర్తి చేసినట్లు టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి తెలిపారు. జిల్లా కేంద్రంలోని టీఎన్జీవోస్ భవనంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యవర్గ అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం తమ యూనియన్‌లో ఎలాంటి అసంతృప్తి లేదని, కొంతమంది సభ్యులు అసంతృపిగా ఉన్నా వారితో చేసిన చర్చలు సఫలమైనట్లు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో జిల్లాలోని ఆరు యూనిట్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యే అవకాశం ఉందని, ప్రాథమిక సభ్యులందరూ ప్రస్తుతం ఉన్న ప్యానల్‌కే మద్దతు తెలుపుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ ప్రధాన కార్యదర్శి భూముల రామ్మోహన్, అసోసియేట్ అధ్యక్షుడు శ్రీపతి బాపురావు, కేంద్ర సంఘం కార్యదర్శి పొన్నం మల్లయ్య, మంచిర్యాల యూనిట్ అధ్యక్షుడు నాగుల గోపాల్, అంజయ్య, ప్రభు, కుమార్ పాల్గొన్నారు.

కోదండరాంకు అభినందనలు

ప్రత్యేక తెలంగాణ సాధనలో కీలక పాత్ర పోషించిన ప్రొఫెసర్ కోదండరాం ఎమ్మెల్సీ పదవి పొందడం జిల్లాకే గర్వకారణమని, టీఎన్జీవోస్ తరఫున అభినందనలు తెలిపారు. తెలంగాణ సాధన ఉద్యమ సమయంలో జేఏసీ చైర్మన్‌గా అన్నివర్గాల మద్దతును కూడగట్టడంలో ఆయన పాత్ర ఎనలేనిదన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

మంచిర్యాలక్రైం: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని షీ టీమ్ ఎస్సై హైమా అన్నారు. ఉమెన్ సేఫ్టీవింగ్ తెలంగాణ పోలీస్, విద్యాశాఖ సహకారంతో సైబర్ అంబాసిడర్లకు శిక్షణ రెండో విడత కార్యక్రమంలో భాగంగా శనివారం జిల్లా కేంద్రంలోని పాత మంచిర్యాల జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలలో శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ల చేతిలో ప్రజలు మోసపోతున్నారని, అప్రమత్తం చేసేందుకు తెలంగాణ పోలీస్ సైబర్ అంబాసిడర్(సీఏపీ) కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. జిల్లాలోని 33 ప్రభుత్వ పాఠశాలల్లో 66మంది మెంటార్ టీచర్ల ద్వారా 122మంది విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా శిక్షణకు ఎంపికయ్యారని తెలిపారు. శిక్షణ పొందిన విద్యార్థులు షీ టీమ్స్ సమన్వయంతో పని చేయాల్సి ఉంటుందని తెలిపారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు మాలదేవి, షీ టీమ్ సిబ్బంది జ్యోతి, సతీష్, శ్రావణ్, తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ పాఠశాల తనిఖీ

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని మైనారిటీ గురుకుల బాలికల పాఠశాలను శనివారం జిల్లా మైనారిటీ అభివృద్ధి శాఖ అధికారి రాజేశ్వరి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల తరగతులు, వంటగదిలో పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. పదో తరగతి, ఇంటర్ విద్యార్థులకు వార్షిక పరీక్షలు సమీపిస్తుండడంతో వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని అధ్యాపకులకు సూచించారు.

వేటగాళ్ల చేతిలో దుప్పిహతం!

సిర్పూర్(టి): సిర్పూర్(టి) అటవీ రేంజ్ పరిధిలోని రైల్వేస్టేషన్ అటవీ ప్రాంతంలో శుక్రవారం కొందరు వ్యక్తులు దుప్పిమాంసం తరలిస్తుండగా అటవీశాఖ అధికారులు పట్టుకుని విచారిస్తున్నట్లు సమాచారం. ఈ విషయమై సిర్పూర్(టి) ఎఫ్ఆర్వో పూర్ణచందర్‌ను సంప్రదించగా వేటగాళ్ల చేతిలో దుప్పి మృతి చెందిందని, విచారణ చేపడుతున్నామన్నారు. విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు.

టీఎస్ఎండీసీ అధికారుల తనిఖీలు

కోటపల్లి: మండలంలోని పారపల్లి వద్ద 63వ జాతీయ రహదారిపై జిల్లా టీఎస్ఎండీసీ సిబ్బంది ఇసుక లారీలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వే బిల్లులు, తూకం కేంద్రాలను అధికారులు పరిశీలించారు. పర్మిట్ ప్రకారమే లారీల్లో ఇసుక తరలిస్తున్నట్లు సిబ్బంది వెల్లడించారు. జిల్లాలో ఎటువంటి ఓవర్‌లోడ్ లేదని, లారీ డ్రైవర్స్ కచ్చితమైన ధ్రువీకరణ పత్రాలతో రవాణా చేయాలని ఆదేశించారు. అధిక లోడ్‌తో వెళ్లే లారీలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. తనిఖీల్లో టీఎస్ఎండీసీ సిబ్బంది పాల్గొన్నారు.

నియామక పత్రాలు ఇవ్వాలని వినతి


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

శ్రీరాంపూర్: ఎన్నికల కారణంగా సింగరేణిలో పెండింగ్‌లో ఉంచిన పలు ఉద్యోగాలకు భర్తీకి సంబంధించిన నియామక పత్రాలను వెంటనే అందించాలని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీసైదా, సెంట్రల్ డెప్యూటీ జనరల్ సెక్రటరీలు కే.వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య శనివారం జీఎం కార్యాలయంలో పర్సనల్ మేనేజర్ రాజేశ్వర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణిలో మెడికల్ బోర్డు ద్వారా అన్‌ఫిట్ అయిన కార్మికుల స్థానంలో డిపెండెంట్లకు, ఎక్స్‌ట్రనల్ ఉద్యోగాల భర్తీకి సంబంధించిన పలు నియామక పత్రాలను వెంటనే ఇవ్వాలన్నారు. సుమారు 600 మంది అభ్యర్థులు ఈ పత్రాల కోసం వేచి ఉన్నారన్నారు. దీనిపై కంపెనీ వెంటనే నిర్ణయం తీసుకొని వారిని ఉద్యోగాల్లోకి తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ ఏరియా కార్యదర్శి మారేపల్లి సారయ్య, నాయకులు గండి సతీష్, బద్రి బుచ్చన్న, సదానందం, కాంట్రాక్టు కార్మికుల సంఘం రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, రాజకుమార్, వంశీకృష్ణ, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

చెన్నూర్ కానిస్టేబుల్‌కు అరుదైన గౌరవం

- రెండేళ్లలో కేంద్ర, రాష్ట్ర పతకాలు
- పదవీ కాలంలో అరుదైన మెడల్స్ సాధించిన హరీశ్


హరీశ్

చెన్నూర్: మంచిర్యాల జిల్లా చెన్నూర్ పట్టణంలోని కొత్తగూడెం కాలనీకి చెందిన నలిమెల హరీశ్ 2018లో కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. గతేడాది రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కఠిన సేవా పతకం సొంతం చేసుకున్నాడు. ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పోలీసు మెడల్ ఫర్ గ్యాలంటరీ పతకానికి ఎంపికయ్యాడు. విధుల్లో చేరిన ఆరేళ్లలో హరీశ్ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల నుంచి రెండు అవార్డులను అందుకోవడం పట్ల పోలీసు అధికారులు, తోటి సిబ్బంది అభినందిస్తున్నారు. హరీశ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో విధులు నిర్వహిస్తున్నాడు.